నవతెలంగాణ

ఆదిలాబాద్

సోమవారం | నవంబర్ 25, 2024 | www.navatelangana.com

వృత్తి నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు



ఆదిలాబాద్‌టౌన్ : చదువుతో ఉద్యోగం వస్తుందో లేదో కానీ వృత్తి నైపుణ్యంతో మాత్రం ఉపాధి దొరుకుతుందని సాయి వైకుంఠ ట్రస్ట్ చైర్మెన్ రవికిరణ్ యాదవ్ అన్నారు. సాయివైకుంఠ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ శిక్షణాలు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఆదివారం పట్టణంలోని యోగభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవికిరణ్ యాదవ్ పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పలువురు అభ్యర్థులు వారి అనుభావాలను వ్యక్త పరిచారు. సాయివైకుంఠ ట్రస్టు ద్వారా అందించే శిక్షణాలను సద్వినియోగం చేసుకుంటు కుటుంబానికి బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నవీన్ యాదవ్, మసుద్, శిక్షకులున్నారు.

మధుమేహ పరీక్షల శిబిరం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధుమేహ వారోత్సవంలో భాగంగా డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం మార్నింగ్ వాక్‌కు వచ్చిన వాకర్స్‌కు లయన్స్ క్లబ్ నిర్మల్ ఆధ్వర్యంలో సుమారు 70 మందికి గ్లూకో మీటర్‌తో బ్లడ్ షుగర్ లెవెల్స్ పరీక్షించారు. మధుమేహ లక్షణాలు, మధుమేహం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సలు మొదలగు విషయాల గురించి వివరాలతో ముద్రించబడ్డ కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే తాజా కాయకూరలు, మైదా, చక్కెర, పిండిపదార్థాలు లేని ఆహారపు అలవాట్లతో, రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, ఒత్తిడిలోని కాకుండా ఉండటం, సరైన నిద్ర లాంటి అలవాట్లతో మధుమేహ వ్యాధిని నివారణ చేసుకోవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు లయన్స్ క్లబ్ నిర్మల్ చంద్రమోహన్‌రెడ్డి, క్లబ్ కోశాధికార లక్ష్మి నారాయణగౌడ్, లయన్స్ జోన్ చైర్మెన్ లక్కడి రాజేశ్వర్‌రెడ్డి, గంగారెడ్డి, వాకింగ్ అండ్ లాఫింగ్ అసోసియేషన్ అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, విజయ పాథలాజికల్ ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

ఉద్యమాల దీపిక..భవిష్యత్తుకు వేదిక..!

- పూర్తయిన సీఐటీయూ కార్యాలయ నిర్మాణం
- కార్మికుల కష్టంతో సాకారమైన ఏండ్ల కల
- ఈ నెల 28న ప్రారంభం
- హాజరుకానున్న రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకారత్

కార్మికుల హక్కులకు అయువుపట్టు.. సంఘటితంగా.. ఐక్య ఉద్యమాలు చేపడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం సల్పడంలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్(సీఐటీయూ)ది కీలకపాత్ర. కార్మికులకు కష్టమొస్తే చాలు తానున్నానంటూ ముందుంటుంది ఈ సంఘం. కార్మికోద్యమాలకు కేంద్ర బిందువుగా ఉండే ఈ సంఘం నూతన భవనాన్ని నిర్మించింది. వివిధ కార్మిక సంఘాలు, శ్రేయోభిలాషులు, అభ్యుదయ వాదుల సహకారంతో నూతన భవన నిర్మాణానికి అంకురార్పణ చేసింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో శ్రామికుల శ్రమ ఫలితంగా వివిధ సౌకర్యాలతో భవన నిర్మాణం పూర్తయింది. ఈ నెల 28న ఉదయం 10.30గంటలకు ఈ కార్యాలయం ఘనంగా ప్రారంభం కానుంది. ముఖ్య అతిథిగా రాజ్యసభ మాజీ సభ్యురాలు, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు కా.బృందాకారత్ హాజరుకానున్నారు. ఆమెతో పాటు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, మాజీ ఎంపీ మిడియం బాబురావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, టీపీజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర బాధ్యులు విశిష్ట అతిథులుగా హాజరుకానున్నారు.



ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న సీఐటీయూ జిల్లా కార్యాలయం

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు చేపట్టడం.. ప్రభుత్వాలు దిగొచ్చి ఫలితం సాధించే వరకు కొట్లాడటంలో సీఐటీయూది కీలకపాత్ర. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేపడుతూ వారికి అండగా నిలుస్తోంది. అనేక ఏండ్లుగా కార్మికుల పక్షాన పోరాడుతున్న ఈ సంఘానికి నూతన భవనం అవసరమైంది. భవిష్యత్తు ఉద్యమాల రూపకల్పనకు వేదికగా నిలిచేందుకు నూతన భవనం నిర్మించాలని సంఘం నాయకులు భావించారు. అనుకున్నదే తడువుగా వీరి ఆలోచనలకు సీఐటీయూ అనుబంధ సంఘాలన్ని మద్దతిచ్చాయి. తమ వంతు సహకారం అందిస్తామని భరోసానిచ్చాయి. నూతనంగా నిర్మించే ఈ కార్యాలయం కేవలం కార్మిక సంఘాలకు వెన్నుదన్నుగా నిలవడమే కాకుండా విజ్ఞాన నిలయంగా ఉండాలని భావించారు. ఇందుకు కార్మిక ఉద్యమాలను నిర్మించడంలో ఎనలేని కృషిచేసి అమరుడైన కా.బాశెట్టి మాధవరావు పేరుతో ఈ భవన నిర్మాణాన్ని చేపట్టారు. కొన్ని నెలల పాటు సాగిన ఈ భవన నిర్మాణం తాజాగా నూతన హంగులతో పూర్తయింది. ఈ నెల 28న ఈ భవనాన్ని ప్రారంభించేందుకు సంఘం నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

భవిష్యత్తు ఉద్యమాలకు వేదిక..!

కార్మికుల ఉద్యమాలకు ఈ సంఘ భవనం వేదికకానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టడం.. కార్మికుల హక్కులను కాపాడటంలో భవిష్యత్తు ఉద్యమాలను నిర్మించేందుకు దోహదం చేయనుంది. కార్మిక ఉద్యమాల్లో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడంలో కీలకపాత్ర పోషించనుంది. ఈ భవన నిర్మాణంలో అంగన్‌వాడీ, ఆశా, రిమ్స్, మెడికల్ అండ్ హెల్త్, గ్రామ పంచాయతీ, భవన నిర్మాణ కార్మిక సంఘం, వీఓఏలు, మధ్యాహ్న భోజన సంఘం తదితర సంఘాలన్నీ ఏకమై ఈ భవన నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాయి. ఫలితంగా వివిధ గదులతో కూడిన నూతన భవనం అందుబాటులోకి వచ్చింది. ఈ సంఘ భవన ప్రారంభోత్సవంలో సంఘం కేంద్ర, రాష్ట్ర కీలక నాయకులతో పాటు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.జయలక్ష్మీ, ఐద్వా ఉపాధ్యక్షురాలు ఆశాలత, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక రాఘవులు, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కోశాధికారి కె.సునీత, టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్ పాల్గొననున్నారు.

కార్మికులు భారీగా తరలిరావాలి

అన్నమొల్ల కిరణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



నూతనంగా నిర్మించిన ఈ భవనం కార్మిక, కర్షక ప్రజా ఉద్యమాలకు కేంద్రం బిందువు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిర్మించే పోరాటాలకు వేదికకానుంది. ఈ భవన నిర్మాణంలో వివిధ సంఘాల భాగస్వామ్యం ఎనలేనిది. దోపిడి, పీడనకు వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని చైతన్యపర్చడంలో సీఐటీయూ కీలకపాత్ర పోషిస్తుంది. ఇందుకు ఈ భవనం భవిష్యత్తు కార్మిక ఉద్యమ నిర్మాణాలకు వేదికగా నిలవనుంది. ప్రారంభోత్సవ సభకు కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలి.

ఉద్యోగ, ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉద్యోగ ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పార్వతి రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జిల్లా సంఘం భవనంలో జిల్లా అధ్యక్షుడు చునార్కార్ తుకారాం అధ్యక్షతన నిర్వహించిన జిల్లా శాఖ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు మెడికల్ రీయంబర్స్‌మెంట్, జీపీఎఫ్ లోన్ లాంటి పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉందని వాటిని వెంటనే చెల్లించాలన్నారు. అసిఫాబాద్ జిల్లాకు రెగ్యులర్ విద్యాధికారి నిర్ధయించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఎంటీఎస్ అమలు చేయాలన్నారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు. ఎస్‌జీటీలకు రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క మాణిక్యరావు, రాష్ట్ర కౌన్సిలర్ సంజయ్ కుమార్, ఆర్థిక కార్యదర్శి సులేమాన్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు జబ్బార్, నాయకులు లక్ష్మణ్, సంతోష్, బాదిరావు, అనూష, శారద, భాస్కర్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కుచులాపూర్ గ్రామంలో ప్రతీ యేటా జరిగే పోచమ్మ తల్లి బోనాల జాతర కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హజరయ్యారు. గ్రామంలో మొదటగా శివసత్తులు గ్రామ మహిళలు బోనం ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రతీ యేటా ఎంతో ఘనంగా జరిగే బోనాల జాతరకు వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. పోచమ్మ తల్లి దీవెనలు ఎల్లప్పుడూ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, సదాశివ్, శ్రీనివాస్, అభిరామిరెడ్డి, ప్రకాష్, కిరణ్ కుమార్, వామన్, జనార్ధన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలను అరికట్టాలి



నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాల్లోని అక్రమాలను అరికట్టాలని సీపీఐ(ఎం) బృందం సభ్యుడు తొడసం శంభు ప్రభుత్వాన్ని కోరారు. నిర్మల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లిలోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సీపీఐ(ఎం) బృందం సభ్యులు పరిశీలించి మాట్లాడారు. రైతుల నుంచి అదనంగా వరిని తీసుకోవడం, గన్నీ బ్యాగుల కొరత, డబ్బుల చెల్లింపులో జాప్యం వంటి వాటిని పరిశీలించినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిరికొండ మండల కేంద్రానికి చెందిన బి.లక్ష్మికి రూ.39వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారులకు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అందజేశారు. ఆయన వెంట సిరికొండ మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, బోథ్ మాజీ మండలాధ్యక్షులు కుర్మే మహేందర్, సిరికొండ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు నవీన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాధవ్ పటేల్, షాదుల్లా, పాల శంకర్, జాదవ్ కపిల్ దేవ్, ఇమామ్, ఉపసర్పంచ్ అబ్దుల్ అజీమ్ పాల్గొన్నారు.

సేవా కేంద్రం ప్రారంభం

ఉట్నూర్ : మండల కేంద్రంలోని సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ప్రజలకు, న్యాయవాదులకు ఉపయోగపడే విధంగా ఈ సేవా కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని జిల్లా జడ్జి ప్రభాకర్‌రావు తెలిపారు. ఆదివారం ఉట్నూర్ విచ్చేసిన జిల్లా జడ్జీకి జూనియర్ సివిల్ జడ్జి పి.మౌనిక పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. ప్రజలకు సేవ అందించే విధంగా ఈసేవా కేంద్రంలో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గోర్ మళావ్‌లో పాల్గొన్న మండలవాసులు

నేరడిగొండ : సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన అల్ ఇండియా గోర్ మళావ్ కార్యక్రమంలో ఆదివారం మండలంలోని పెద్ద బుగ్గారాం గ్రామానికి చెందిన బంజారా నాయకులు రాథోడ్ సురేందర్ హజరై మాట్లాడారు. సాంస్కృతి సాంప్రదాయాలను మరిచిపోకుండా ఇప్పుడు జరుగుతున్న దాన్నిబట్టి తప్పుదారిలో వెళ్లకుండా మంచి కార్యక్రమాల్లో పాల్గొనాలని, తోటి వారికి సహాయ పడే విధంగా ఉండాలని వేడుకుంటూ సంవత్సరానికి ఒక రాష్ట్రంలో ఈ పండగ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో, జాదవ్ మహేష్, మంగులాల్, సంజీవ్, రాథోడ్ పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతిని జయప్రదం చేయాలి

ఉట్నూర్ : ఫిబ్రవరి 15న సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాథోడ్ మహేందర్ ఆదివారం మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల డిసెంబర్‌లో పాత కమిటీని రద్దుచేసి కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సభకు ఉట్నూర్ మండలంలోని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన బంజారా సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బంజారా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ సభ్యులు జాదవ్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

- 26న జిల్లా కేంద్రంలో నిరసన



నవతెలంగాణ-ఖానాపూర్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 26న జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు ఐఎఫ్టీయూ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఖానాపూర్ పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు కార్మిక కోడ్‌లను కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, 8 గంటల పని దినం, ట్రేడ్ యూనియన్ హక్కు వంటి హామీలను రద్దు చేస్తున్నారనీ అన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాలు సంవత్సరాలుగా పోరాడుతున్న ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కాంట్రాక్టు విధానాన్ని నిషేధించాలని, కనీసం వేతనం నెలకు రూ.26వేలు, పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, రక్షణ, రైల్వే, ఉద్యోగం, విద్య, విద్యుత్‌ను ప్రయివేటీకరించవద్దని, గృహాలకు ఉచిత విద్యుత్ 300 యూనిట్స్ వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూ సేకరణ చట్టం 2013ను అమలు చేయాలని, అటవీ హక్కుల చట్టం 2006ను ప్రతిష్టంగా అమలు చేయాలని, హక్కు పత్రాలు ఉన్నా రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలన్నారు. రైతులందరికీ పూర్తిగా వంట రుణాలను మాఫీ చేయాలని, మతాల మధ్య విభజన ఆపాలని రాజ్యాంగంలోని పొందుపరచుకున్న లౌకిక సంప్రదాయాలను కాపాడాలని, తదితర డిమాండ్లతో ఈనెల 26న దేశవ్యాప్తంగా జరిగే జిల్లా కేంద్రాలలో ఆందోళన నిరసన కార్యక్రమాలలో కార్మికులు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు గోనే స్వామి, గుట్ల ప్రసాద్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ కమిటీలను ఎన్నుకోవాలి

నవతెలంగాణ-నేరడిగొండ

బీజేపీ నూతన పోలింగ్ బూత్ కమిటీలను ఎన్నుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. ఆదివారం మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని అందుకు అనుగుణంగా పోలింగ్ బూత్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపుకై సంస్థాగతంగా పటిష్టపరిచే బాధ్యతను పార్టీ నాయకులు, తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్, నాయకులు రాజశేఖర్, రాములు, నారాయణ, పరశురాం, శ్రీను, లక్ష్మణ్, ప్రవీణ్, శ్రీధర్ రెడ్డి, ప్రకాష్, నవీన్, ఉత్తం, జమీర్, శేఖర్ పాల్గొన్నారు.

కలిసి కట్టుగా గ్రామాభివృద్ధికి కృషి చేద్దాం

నవతెలంగాణ-ఇచ్చోడ

గ్రామస్తులంతా కలిసి కట్టుగా ఇచ్చోడ గ్రామాభివృద్ధి కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం ఇచ్చోడ మండల కేంద్రంలో నూతన గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నికల్లో భాగంగా గ్రామస్తులు కలిసి ముందుగా వీడీసీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 5న గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకొన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏనుగు కృష్ణారెడ్డి, భీమ్‌రెడ్డి, అన్నెల లక్ష్మణ్, మెడపట్ల సురేష్, నరేందర్, నరాల రమణయ్య, రమేష్, పాండు రంగ్, బొజ్జ రవి, లక్ష్మి నారాయణ, పోనుకంటి ఆశన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో రుచికరమైన భోజనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు రుచికరమైన భోజనం అందిస్తున్నారని, వాటి రుచులను పరిశీలించేందుకు గాను పోటీలను నిర్వహించామని డీఈఓ ప్రణీత తెలిపారు. ఆదివారం డైట్ కళాశాల ఆవరణలో ప్రధాన మంత్రి పోషన్ అభియాన్‌లో భాగంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులకు భోజన నాణ్యత పోటీలను నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన నిర్వాహకులు వారి వెంట తీసుకువచ్చిన సామాగ్రితో వంటలు చేశారు. అనంతరం డీఈఓ న్యాయనిర్ణేతలుగా ఉన్న వారు వాటి రుచులను చూశారు. అనంతరం ఎంపికైన వారికి మొదటి బహుమతి రూ.15 వందలు, రెండో బహుమతి రూ.వెయ్యి, మూడో బహుమతి రూ.500 అందించనున్నామని డీఈఓ తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రణీత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మరింత నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి పోషన్ అభియాన్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో నిర్వాహకులు మంచి రుచికరమైన భోజనాన్ని తయారు చేశారన్నారు. ఇలానే ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనాన్ని విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన వారికి నగదు రివార్డును అందించామని తెలిపారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయికి కూడా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా పాల్గొన్న మిగిత వారికి కూడా ప్రోత్సహకంగా నగదును అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కిరణ్, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, కంటే నర్సయ్య, పాల్గొన్నారు.

లేబర్ కార్డు ఉన్నవారికి ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ఆదివారం తెలంగాణ కార్మికశాఖ కింద నమోదిత భవన నిర్మాణ కార్మికుల కోసం ఉచితంగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ పర్వేజ్ మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. కార్మికుల రక్త నమూనాలు తీసుకుని ఉచితంగా 50 రకాల రక్త పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. అంతే కాకుండా ఉచిత ఆరోగ్య శిబిరంతో పాటు డిజిటల్ స్క్రీనింగ్ కార్డ్ ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ పజిల్, గ్రామస్తుల పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నమెంట్‌కు ఆహ్వానం

నేరడిగొండ : మండలంలోని వడూర్ గ్రామంలో ఈనెల 28న ప్రారంభమయ్యే వైడూర్యపురం కబడ్డీ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆహ్వానించారు. కాగా ఆదివారం టోర్నమెంట్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రికను వడూర్ గ్రామ యువకులు అందజేసి హాజరు కావాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

- బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్

కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతువ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరూ పోరాటాలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. ఆదివారం సంయుక్త కిసాన్ మోర్చా జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపులో భాగంగా తెలంగాణ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 26న నిర్మల్ జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులు, వ్యవసాయ కూలీలు కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఖానాపూర్ ప్రజాసంఘాల కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. నరేంద్ర మోడీ సర్కారు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, 14 డిమాండ్స్‌తో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా రైతులతో జరిగిన చర్చలలో రైతాంగానికి నరేంద్ర మోడీ సర్కార్ అనేక హామీలు ఇచ్చారని అన్నారు. ఢిల్లీ కేంద్రంగా జరిగిన పోరాటంలో అమరులైన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు చెల్లిస్తామని హామీ ఇచ్చి మర్చిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, ఖానాపూర్ మండలాధ్యక్షులు నలిమెల రాజేష్, కార్యదర్శి సంచుల నారాయణ, ఉపాధ్యక్షులు పానుగంటి నరేష్, కోకన్వీనర్, గడ్డం రాజేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూనింటి దామోదర్‌రెడ్డి చిన్న నాన్న నర్సారెడ్డి ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, ఆదిలాబాద్ పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నర్సారెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం జైనథ్ మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్త బద్దం సురేష్‌రెడ్డి తండ్రి హన్మంత్‌రెడ్డి ఇటీవల మృతి చెందాగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జైనథ్ ఆలయ కమిటీ చైర్మెన్ అడ్డి రూకేష్‌రెడ్డి, నాయకులు గడ్డం జగదీశ్ రెడ్డి, విశాల్, నవీన్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీఈఓ

నిర్మల్‌టౌన్ : నిర్మల్ పట్టణంలోని జుమేరాత్‌పేట్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ పరీక్ష కేంద్రాన్ని ఆదివారం డీఈఓ రామారావు సందర్శించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలని, కాపీయింగ్‌కు పాల్పడకుండా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ పరీక్షకు 339 విద్యార్థులకు గాను 332 మంది హాజరు అయ్యారని, 7గురు గైర్హాజరు అయ్యారని తెలిపారు. ఆయనతో పాటు హెచ్ఎం రవిబాబు, ముఖ్య పర్యవేక్షకులు కిషన్, లింబాద్రి ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | నవంబర్ 25, 2024 | www.navatelangana.com

ఉద్యోగం సాధించిన యువతీ యువకులకు సన్మానం

నవతెలంగాణ-ఖానాపూర్



నూతనంగా కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై ట్రైనింగ్ పూర్తి చేసుకున్న యువతీ యువకులను 7వ వార్డు కౌన్సిలర్ కిషోర్ నాయక్ సన్మానించారు. వార్డు పరిధిలోని పద్మావతి నగర్ కాలానికి చెందిన ఆకుల మమత, గడుగు నిఖిల్, బెజ్జరపు అనీల్ చారి ఇటీవలే కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికై శిక్షణ పూర్తి చేశారు. వారిని కౌన్సిలర్ సన్మానించి అభినందనలు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతీ యువకులు వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, నాయకులు జుని కుమార్, నయీమ్, రామ భీమన్న, కడమంచి భాస్కర్, నడిమట్ల సురేష్, ఆకుల పోశెట్టి, ప్రభాకర్, కడమంచి గంగాధర్ పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన యువకుడికి సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామానికి చెందిన శ్రీనివాస్, అనిత దంపతుల కుమారుడు ఆవుల నిఖిల్ వరసగా రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం పట్ల మాజీ మంత్రి జోగు రామన్న అభినందనలు తెలియజేశారు. 2022లో రైల్వే గ్రూప్-డి ఉద్యోగంతో పాటు గ్రూప్-4లో గ్రంథాలయ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా కొలువు సాధించారు. ఆదివారం జోగు రామన్న నివాసంలో ఆయనను శాలువలతో సత్కరించారు. యువత నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా కష్టపడితే సరైన ఫలితం దక్కుతుందని తెలిపారు. తన స్వగ్రామం నుండి వచ్చిన యువకుడు రెండు ఉద్యోగాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

సబ్ స్టేషన్ గోడౌన్‌లో షార్ట్ సర్క్యూట్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సబ్ స్టేషన్ గోడౌన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు పట్టణంలోని భుక్తాపూర్ సబ్ స్టేషన్‌లోని జేపీఈ గోడౌన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలు వ్యాపించకుండా మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న సబ్ కాంట్రాక్టర్ కేంద్రే శివ అక్కడి చేరుకున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి రావడంతో పెద్ద నష్టం జరగలేదన్నారు. పక్కనే టాన్స్‌ఫార్మర్ల గోడౌన్ ఉంది. మంటలు అక్కడి అంటుకుంటే పెద్ద ప్రమాదమే జరిగేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సబ్ కాంట్రాక్టర్ మాట్లాడుతూ ఎవరు లేని సమయంలో మంటలు చెలరేగాయని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్‌లో జరిగిన ప్రమాదంలో దాదాపు రూ.20 నుంచి 25 వేల నష్టం వాటిల్లిదని తెలిపారు. కాగా పెద్ద నష్టం నుండి అగ్నిప్రమాదం నుండి బయపడ్డట్లు పేర్కొన్నారు.

పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని భీమ్ ఆర్మీ అజాద్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ షకీల్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని హత్తిగుట్ట గ్రామాన్ని సందర్శించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల పంటలకు పెట్టుబడి ఎక్కువ దిగుబడి తక్కువ ఉండటంతో రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టానికి గురవుతున్నారన్నారు. పంట సాగు కోసం పెట్టిన ఖర్చులు రాకుండా ప్రభుత్వ మద్దతు ధర ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంవత్సరమంతా కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలపై దృష్టి సారించి పత్తి పంటలు కనీసం క్వింటాటలకు రూ.10 వేల ధర కల్పించి ఆదుకోవాలని కోరారు.

సప్తాహలతో గ్రామాల్లో ఐక్యతా భావం

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్
- విఠలేశ్వర ఆలయ అభివృద్ధిపై ప్రధాన దృష్టి



నవతెలంగాణ-కుబీర్

తాళ సప్తమి వేడుకలతో గ్రామాల్లో ఐక్యత భావం పెంపొందుతుందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విఠలేశ్వరాలయంలో నిర్వహించిన తాళ సప్తమి వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. మండలం మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉండటం మూలంగా, ఇక్కడ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో ఆనవాయితిగా తాళ సప్తమి వేడుకలు జరుపుకుంటారన్నారు. సప్తహాలో ఏడు రోజుల పాటు గ్రామస్తులంతా మద్యం, మాంసాలకు దూరం ఉంటూ భక్తి భావంతో ఉంటారన్నారు. భక్తి భావంతోనే ఐక్యత భావం పొందుతుందని, కుబీర్ వాసులంతా విఠలేశ్వరాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. రెండవ పండరీపురంగా ప్రసిద్ధికెక్కుతున్న విఠలేశ్వర ఆలయ అభివృద్ధికి తన వంతుగా పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కాసేపు వీణాధరణ చేసి పూజలు నిర్వహించారు. ఆయన వెంట స్థానిక నాయకులు బోయిడి విఠల్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంటజీ పుప్పల పీరాజీ, సూది రాజన్న, నాగలింగం, ఏశాల దత్తాత్రి, గులాబ్ నాయక్, ప్యాట లక్ష్మణ్, పుప్పాల లింగం, ఎన్నెల నాగేందర్ ఉన్నారు.

రుణాలందిస్తూ సేవలు విస్తృతం చేస్తున్నాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అత్యవసర సమయంలో చిరు వ్యాపారులకు రుణాలు అందిస్తు తమ సేవలను మరింత విస్తృతం చేస్తున్నామని సేవ బ్యాంక్ హైదరాబాద్ రిజినల్ కోఆర్డినేటర్ ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు. 2021-23 సంవత్సరంలో బ్యాంకుకు వచ్చిన ఆదాయంలో ఖర్చు పోను మిగిలిన డబ్బులను ఖాతారుల అకౌంట్లకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని టీఎన్‌జీఓస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వాటి వివరాలను ఖాతాదారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ కోఆర్డినేటర్ ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ ఎలాంటి వడ్డీ లేకుండా చిరువ్యాపారులకు అత్యవసర సమయంలో రుణాలను అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 బ్రాంచులతో సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. 2017, 2020, 2021-23 ఇలా మూడు దఫాలుగా బ్యాంక్ ఆదాయం నుంచి ఖర్చులు పోను మిగిలిన వాటిని ఖాతాదారులకు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌లోని 190 మంది ఖాతారులకు రూ.లక్ష 49 వేల 701 వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ జిల్లా అధ్యక్షుడు తన్వీర్, జీయ, ఆసీఫ్ ఉన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

జిల్లాలో ఎన్ఎంఎంఎస్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నిర్మల్‌లో 2, భైంసాలో 2, ఖానాపూర్‌లో 1 మొత్తం 5 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం ప్రారంభమైన పరీక్షకు విద్యార్థులను తనిఖీ చేసిన అనంతరం లోనికి అనుమతించారు. కాగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని జుమ్మెరాత్ పేట్, సోమవార్ పేట్ పరీక్ష కేంద్రాలను డీఈఓ రామారావు సందర్శించి పరీక్ష కొనసాగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో అన్ని వసతులు కల్పించామని, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాశారన్నారు. ఈ రెండు కేంద్రాలలో మొత్తం 339 విద్యార్థులకు గాను 332 మంది హాజరయ్యారని, ఏగురు గైర్హాజరయ్యారని తెలిపారు. ఆయనతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిబాబు, ముఖ్య పర్యవేక్షకులు కిషన్, ఏఎస్‌సీ లింబాద్రి పాల్గొన్నారు.

కడెం : ఖానాపూర్ మండల కేంద్రంలోని బాలికల జడ్పీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన



ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్) పరీక్ష 2024కు విద్యార్థులు హాజరయ్యారు. మండలంలోని లింగాపూర్ జడ్పీ పాఠశాలలోని ఎనిమిదవ తరగతి విద్యార్థులు 42 మంది హాజరయ్యారని హెచ్ ఎం.వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ కేవలం ఎన్‌సీసీతోనే సాధ్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశభక్తి, జాతీయ వాదం, క్రమశిక్షణ కేవలం ఎన్‌సీసీతోనే సాధ్యమని ఎన్సీసీ లెఫ్టినెంట్ పుట్ట లక్ష్మణ్ అన్నారు. ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాల పురుషుల బోథ్ నుంచి ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ క్యాంప్ ఎదుట కాడెట్లతో కలిసి ఎన్‌సీసీ ఆవిర్భావం గురించి తెలియజేశారు. క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని పుట్ట లక్ష్మణ్ అన్నారు. ఉన్నత చదువులతో పాటు ఇతర అంశాల్లో ఎన్‌సీసీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అగ్నివీర్‌లో కూడా ఎన్‌సీసీ కెడెట్ల కోసం ప్రత్యేక కోటా ఉంటుందన్నారు. సైన్యానికి మారుపేరుగా ఎన్‌సీసీ ఉందని, ప్రతి ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమలో పీఐ స్టాఫ్ బ్రజేష్ కుమార్, హవల్దార్ ఆంజనేయులు, మనోజ్, సిద్దు నాయక్, కెడెట్లు పాల్గొన్నారు.



కళాశాలలో ఎన్‌సీసీ డే వేడుకలు

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా క్యాడేట్ల చేత ప్రతిజ్ఞ, ఎన్‌సీసీ గేయాన్ని ఆలపించారు. అనంతరం కళాశాలలోని చెత్తా చెదారాన్ని తొలగించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి ర్యాలీ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతి రఘు మాట్లాడుతూ ఎన్‌సీసీ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ అధికారి చంద్రకాంత్, శ్రీనివాస్, క్యాడేట్లు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండలంలోని తెలంగాణ గిరిజన గురుకులం లాల్‌టెక్డి పాఠశాలలో 78వ ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ హరి రామ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ కెడెట్లు దేశ రక్షణ, ఐక్యత క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఆర్మీ, నేవీ, వాయు సైన్యంలో సర్టిఫికెట్లు చాలా ఉపయోగపడుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర యాక్టివిటీస్‌లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఏఎన్‌ఓ మధురావు, వైస్ ప్రిన్సిపాల్ రామనాథం, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందిలు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిర్మల్ రూరల్ : నిర్మల్ పట్టణంలోని కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాడెట్లు నిర్వహించిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ యాటకారి సాయన్న మాట్లాడుతూ భారతదేశ మొదటి అతిపెద్ద ప్రభుత్వ రంగ యువ సైనిక సైన్యంగా ఎన్‌సీసీ కొనసాగుతుందన్నారు. ఇప్పటికే ఎన్‌సీసీలో చేరి వందలాది మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించి దేశ రక్షణలో భాగంగా ఆర్మీ, నేవి, వాయు, సైనిక దళ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి దేశ సేవకు అంకితం కావాలన్నారు. క్రమశిక్షణకు ఎన్‌సీసీ మారుపేరుగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మధుసూదన్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని విట్టోలి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం అడిషనల్ కలెక్టర్ కిషోర్ బాబు పరిశీలించారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. వరి కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని రైతుల నుండి తీసుకున్న 24 గంటలలో రైతుల ఖాతాలో డబ్బులు జమవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా సూచనలు తెలియజేశారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ కేంద్రాన్ని సందర్శించి పలు వివరాలు తహసీల్దార్ శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు లేకుండా సర్వే వివరాలను పగడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం అక్కడి నుండి ముధోల్‌లోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని తరోడ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు కేంద్రాన్ని పరిశీలించి బీఎల్‌ఓలకు వివరాలు అడిగి తెలుసుకుంటు సూచనలు చేశారు.

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



నవతెలంగాణ-పెంబి

మండల కేంద్రానికి చెందిన బెక్కం నర్సయ్య శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పాలసీ కట్టుకున్నారు. పాలసీ కట్టిన 8 నెలల్లోనే దురదృష్టవశాత్తు గుండెపోటుతో మరణించారు. నామిని అతని కుమారుడు పవన్ కుమార్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి రూ.4 లక్షల పన్నెండు వేల 550 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇన్సూరెన్స్ అనేది సంపాదించే వ్యక్తి ఏ కారణం చేతనైనా మరణిస్తే వారి కుటుంబానికీ అండగా ఉంటుందని, ప్రతి వ్యక్తి తప్పకుండా ఇన్సూరెన్స్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ ఏజీఎం జి.సతీష్ కుమార్, నిర్మల్ డీఎం ఎ.రాకేష్, మేనేజర్ పి.సతీష్, చంద్ర శేఖర్, శివ, మహేష్, శేఖర్, నరేందర్, నరేష్, రమణ, దేవేందర్, శ్రీనివాస్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పుణ్యతిథి వేడుకలు

నవతెలంగాణ-బేల

మండలంలోని సాంగిడిలో ఆధ్యాత్మిక గురువు బాజీరావు మహారాజ్ పుణ్యతి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పల్లకితో ఊరేగింపు నిర్వహించగా భక్తులు ఇంటింటా పూజలు నిర్వహించారు. భజన కీర్తనల నడుమ ఊరేగింపు కొనసాగింది. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. పుణ్యతిథి కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

నేతకాని మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని రాంజీ గోండు భవనంలో ఆదివారం నేతకాని మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా జాడి మల్లయ్య, అధ్యక్షుడిగా గొల్లపల్లి నరసయ్య, ఉపాధ్యక్షులుగా మహేందర్, లింగన్న, ప్రధాన కార్యదర్శిగా జాడి రాజేశ్వర్, సలహాదారులు, కోశాధికారి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని సత్కరించి అభినందనలు తెలిపారు.



శాస్త్రీయ ధృక్పథాన్ని పెంపొందించేలా కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సైన్స్‌పై అవగాహన పెంచడంతో పాటు శాస్త్రీయ ధృక్పధాన్ని పెంపొందించేలా జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందని వేదిక జిల్లా అధ్యక్షుడు ఉమాకాంత్ అన్నారు. ప్రపంచ జీవ పరిణామ దినోత్సవాన్ని పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జీవ పరిణామ సిద్ధాంత ప్రచారోద్యమ పోస్టర్లను విడుదల చేశారు. ఆదివారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో విశ్రాంత విద్యాశాఖ అధికారి లింగయ్యతో కలిసి వాటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఉమాకాంత్ మాట్లాడుతూ 1859 నవంబర్ 24న చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని వెల్లడిస్తు ది ఓరిజిన్ ఆఫ్ స్పెసెస్ అనే గ్రంథాన్ని రచించారన్నారు. జేవీవీ దాన్ని అనుసరిస్తు ప్రతి ఏటా జీవ పరిణామ సిద్దాంత ప్రచారోద్యమాన్ని వారం రోజుల పాటు నిర్వహిస్తుందన్నారు. దానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశామన్నారు. మూఢనమ్మకాలు, విశ్వాసాలను రూపుమాపి సైన్స్ గురించి తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు ఉషన్న, నారాయణ రెడ్డి, గంగన్న, ప్రేమ్ కుమార్, శ్రీధరాబాబు, లింగన్న, నాగరాజు పాల్గొన్నారు.

మడావి తుకారాం వర్ధంతి కరపత్రాల విడుదల



నవతెలంగాణ-ఉట్నూర్

స్వర్గీయ మడావి తుకారం వర్ధంతి సభ, స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌ల కరపత్రలను విడుదల చేశారు. ఆదివారం ప్రెస్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొట్నాక్ ఒమేష్ మాట్లాడుతూ ఈనెల 29న సూర్య మడావి తుకారం వర్ధంతి సభ సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. వాలీబాల్ క్రీడాకారులు లక్కెట్టిపేట్ గ్రామంలో వచ్చి తమ ఎంట్రీ ఫీజు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో తోడసం జనార్ధన్, ఆత్రం మారుతి, ఆర్కా ఒమేష్, ఆర్కా గంగారాం, భగవత్ రావు, కృష్ణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సహా తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌కు సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి పార్థసారథి, సీనియర్ పీడీ హరిచరణ్, సూపరింటెండెంట్ రాఖిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తైక్వాండో ఒక ఆత్మ రక్షణ శిక్షణ కాదన్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం ప్రాక్టీస్ చేయాలని సీనియర్ జూనియర్ నేషనల్స్ ఆడి విద్యార్థులు విద్యారంగంలోనే కాదు ఉద్యోగ రంగంలో కూడా సర్టిఫికెట్ ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆదేశం మేరకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రతి ఆదివారం ఉచిత తైక్వాండో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ నేర్చుకున్న విద్యార్థులు బెల్ట్ రీడింగ్ టెస్ట్ పాల్గొనడం అభినందనీయమన్నారు. క్లబ్ ప్రెసిడెంట్ పెలియ శివప్రసాద్, జిల్లా సెక్రెటరీ అన్నారపు వీరేష్, అఫీషియల్ సెక్రటరీ ఆకోజివార్ శృతి, ట్రెజరర్ మెంబర్ కన్య మాధవి, ఉపాధ్యక్షులు వనిత రాథోడ్, సీనియర్ కోచ్‌లు ప్రణయ్ కుమార్, శివకుమార్, అజయ్ పాల్గొన్నారు.

ప్రజాపాలనపై అవగాహన



నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అంగడిలో ప్రజాపాలన విజయోత్సవల్లో భాగంగా ప్రభుత్వ పథకాలపై పాటల రూపంలో కళాకారులు అవగాహన కల్పించారు. సమగ్ర కుటుంబ సర్వే, 6 గ్యారంటీలపై పాటల రూపంలో తెలియజేశారు. కార్యక్రమంలో కళాకారులు ఆత్రం గోవింద్ రావు, గెడం ఆసిస్, కుమ్ర నగేష్, రాథోడ్ శంకర్, కొడప దూర్పత పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థినికి పరామర్శ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వాంకిడి ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారంతో తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న 9వ తరగతి విద్యార్థిని శైలజను ఎమ్మెల్యే కోవలక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులను ఆమె పరిస్థితి అడిగి తెలుసుకొని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. విద్యార్థినికి నాణ్యమైన వైద్యం అందించాలని, ఎప్పటికప్పుడు విద్యార్థిని పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు. ఏ అవసరం వచ్చిన తనను సంప్రదించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థినికి అండగా ఉంటామన్నారు. ఆమెతో పాటు గిరిజన సంక్షేమ శాఖ కమిషనరెట్ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి..10 మందిపై కేసు నమోదు

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని బంబార గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై ప్రశాంత్‌కు అందిన సమాచారం మేరకు సిబ్బందితో బంబారా గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 10 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.4,500 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడినట్లు తెలిస్తే 8712670531 నంబర్‌కు కానీ 100కు కానీ సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని బీబ్రా గ్రామ పంచాయతీ పరిధిలోని దేవాజిగూడా గ్రామంలో ఆదివారం సాయంత్రం ట్రాక్టర్ ట్రాలీ కిందపడి కృష్ణయ్య వనిత దంపతుల కుమారుడు సదువుల రిశాన్(4) మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి సమీపంలో ఆడుకుంటున్న సమయంలో ఇంటి ముందు నుంచి వెళ్తున్న ట్రాక్టర్ ప్రక్కనుండి వెళ్తూ ఒక్కసారిగా వెనుక టైర్ కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన బాలున్ని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఎస్సై రాజు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

గుప్త నిధుల కోసం వచ్చిన ముఠా..

- అదుపులోకి తీసుకున్న అటవీ శాఖ అధికారులు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

గుప్త నిధుల కోసం వచ్చిన ముఠాను అటవీ శాఖ అధికారులు అదుపులో తీసుకున్నారు. పెంచికల్‌పేట్ బీట్ పరిధిలో లోడ్‌పెల్లి బీట్‌లో సిద్దేశ్వర ఆలయ గుట్ట ప్రాంతంలో సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు పరిశీలించారు. అక్కడ ఏడుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సిద్దేశ్వర గుట్ట ప్రాంతంలో తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకొని రేంజ్ కార్యాలయానికీ తీసుకువచ్చారు. ఈ సందర్భంగా రేంజ్ కార్యాలయంలో వారిని రేంజ్ అధికారి అనిల్ కుమార్ విచారించగా గుప్త నిధుల తవ్వకాల కోసం ఈ ప్రాంతానికి వచ్చినట్లు వారు ఒప్పుకున్నట్టు తెలిపారు. వచ్చిన వారిలో పాగిడె వసంతరావు(బొంబాయి కూడా), పొట్టె ప్రవీణ్ కుమార్ (ఎనగందుల గ్రామం), వెంకన్న, సురేందర్, అంజన్న (బావుపేట్), గుడిపెల్లి రమేష్ కరీంనగర్‌కు చెందిన వారుగా గుర్తించి గుప్త నిధుల కోసం వచ్చినట్టు వెల్లడించారు. ఈ దాడుల్లో డిప్యూటీ రేంజ్ అధికారి జమీర్ అహ్మద్, డిప్యూటీ రేంజ్ అధికారి ముసవీర్, సెక్షన్ అధికారులు వేణుగోపాలరావు, వేట అధికారులు లచ్చన్న, మహేష్, సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమి ప్రాంగణంలో సమతా భారత్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవ ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోకెల్లా మహోన్నతమైనదన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతిఒక్కరూ కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ పీఠిక మన దేశ ఔన్నత్యానికి ప్రతీకని, ఆధునిక ప్రజాస్వామ్య చరిత్రలో విశిష్టమైనదని పేర్కొన్నారు. అనంతరం ఉద్యోగులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మి నారాయణ, ప్రముఖ గుండె జబ్బుల నిపుణులు గోపినాథ్, సామాజిక కార్యకర్త నిర్మల, సమతా భారత్ ఐక్య వేదిక ప్రతినిధులు జాడి అన్నరావు, ఆనంద్ రావు, డా. డోంగ్రి బేమాజీ, సంతోష్, ప్రవీణ్ కుమార్, ఆసిఫాబాద్ సెంటర్ కమిటీ అధ్యక్షుడు హెక్టు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వికలాంగుల, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పింఛన్లకు ఈనెల 26న హైదరాబాద్‌లో చేపట్టిన ఆకలికేకల ఆవేదన మహాధర్నా విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల సంఘం నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహాధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు ఇస్లాం బిన్ హసన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు ఇచ్చిన పింఛన్లకు సంబంధించి సంవత్సరం పూర్తయిన హామీ నిలబెట్టుకోలేదన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా ఆకలికేకల ఆవేదన మహాధర్నా పేరుతో చలో హైదరాబాద్ పిలుపు ఇచ్చినట్లు వివరించారు. దీనికి జిల్లా నుండి పెద్ద ఎత్తున వృద్ధులు వికలాంగులు వితంతువులు హాజరుకావాలని కోరారు. ఈ మహా ధర్నాకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బన్నమూర్తి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రేగుంట మహేష్, జిల్లా నాయకులు రాజయ్య, శ్రీనివాస్, నారాయణ గౌడ్, పాలకురావు, సంతోష్, మొండి పాల్గొన్నారు.

తాగునీటి గోస..!

- ఎంజేపీ గురుకులంలో పని చేయని ఆర్ఓ ప్లాంట్
- శుద్ధనీరు లభించక విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రతి ఇంటికి శుద్ధ నీటిని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ప్రభుత్వాలు పదేపదే చెబుతున్న క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. హాస్టళ్లలో ఏదైనా సంఘటన జరిగితే సంబంధిత అధికారులపై చర్య తీసుకుంటున్న ఉన్నతాధికారులు మౌలిక వసతులు కల్పించడంపై మాత్రం శ్రద్ధ వహించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఆరు వందల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి కోసం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేసిన అది పనిచేయకపోవడంతో తాగునీరు కొనాల్సిన పరిస్థితి దాపురించింది.

2022 సంవత్సరంలో పాఠశాలకు ఆర్ఓ ప్లాంట్ మంజూరైంది. అప్పుడున్న అధికారులు పట్టించుకోకపోవడంతో అది అక్కడ వృథాగా పడి ఉంది. తాజాగా నూతన భవనంలోకి పాఠశాలను తరలించడం పాత సిబ్బంది బదిలీ అయ్యి వారి స్థానంలో కొత్తవారు రావడంతో ఆర్ఓ ప్లాంట్ పని చేసే దిశగా ప్రయత్నాలు చేసినప్పటికీ వృథా ప్రయత్నంగా మారింది. విద్యార్థులు తాగునీరు బయట నుండి మినరల్ తెప్పించడంతో నెలకు రూ.40,000 వరకు చెల్లించాల్సి వస్తుందని సదరు ప్రిన్సిపాల్ తెలిపారు. ఉన్న ఆర్ఓ ప్లాంట్ పనిచేసేలా చేస్తే నెలకు రూ.40000 ప్రజాధనం వృథా కాకుండా ఉంటుంది.



ఆర్ఓ ప్లాంట్ పనిచేయక అవస్థలు



ఎంజేపీ విద్యార్థుల తాగునీటి గోస

ఆర్ఓ ప్లాంట్ పనిచేయకపోవడంతో జిల్లా కేంద్రంలోని మినరల్ వాటర్ ప్లాంట్ నుండి క్యాన్లు కొనుగోలు చేయాల్సి వస్తుంది. ఒకవేళ నీళ్ల రావడం ఆలస్యం అయితే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆర్ఓ ప్లాంట్ పనిచేసేలా చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. అసలే వ్యాధులు ప్రబలే కాలం కావడంతో శుద్ధ జలం అందించేల చూడాలని విన్నవిస్తున్నారు.

స్పందించని అధికారులు

ఆర్ఓ ప్లాంట్‌కు సంబంధించి ప్రస్తుత ప్రిన్సిపాల్ జిల్లా అధికారులతో పాటు రాష్ట్ర మంత్రిని కూడా కలిసినట్లు తెలిసింది. అయిన అధికారులు స్పందించకపోవడం బాధాకరం. విద్యార్థులకు తాగునీరు సరిగ్గా లేక ఏదైనా జరిగితే బాధ్యత ఎవరు తీసుకుంటారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎదైన జరిగిన తరువాత స్పందించే కన్న ముందుగానే వసతులు కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అంచనాలు తయారు చేసి పంపించాం

శ్వేత, పాఠశాల ప్రిన్సిపాల్.

ఆర్ఓ ప్లాంట్ భాగాలు వేరువేరుగా ఉండి పూర్తిగా చెడిపోగా వీటి మరమ్మతుల కోసం అంచనాలు తయారు చేసి పంపించిన ఇంకా నిధులు మంజూరు కాలేదు. దీంతో ప్రతి నెల రూ.40,000 నీటి కోసం చెల్లించాల్సి వస్తుంది. మంత్రి దృష్టికి కూడా సమస్య తీసుకువెళ్లాను. అధికారుల స్పందించి నిధులు మంజూరు చేయాలి.

ప్లాంట్ లేక ఇబ్బందులు పడుతున్నాం

అజయ్, పదవ తరగతి విద్యార్థి

ఆర్ఓ ప్లాంట్ పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రెండు సంవత్సరాల క్రితం ప్లాంట్ మంజూరైన దానిని బిగించకపోవడం నిర్వహణ లేకపోవడంతో మూలన పడిపోయింది. అధికారులు స్పందించి ప్లాంట్ మరమ్మతులు చేయాలని కోరుతున్నాం.

కుమురం భీం విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని పోతపెల్లి గ్రామంలో ఆదివాసుల ఆరాధ్య దైవం జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరాడిన కుమురం భీం విగ్రహాన్ని భీం మనుమడు సోనేరావు, గోండ్వానా మహాసభ జాతీయ అధ్యక్షుడు సిడాం అర్జు, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ప్రత్యేక పూజలు చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసులు భాజా భజంత్రీలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప యోధుడు కుమురం భీం అని అటవిని జీవనోపాధిగా చేసుకున్న భీం నిజాం సర్కారును ఎదురించాడన్నారు. ఆదివాసుల సంక్షేమం కోసం చివరి వరకు పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. తమ అస్తిత్వం కోసం ఆదివాసులు పోరాటాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో



ఆదివాసీ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచం, డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం నాయక్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడాం గణపతి, ఆదివాసీ నాయకులు సోయం చిన్నన్న, తలండి మధుకర్, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, నాయకులు అర్షద్ హుస్సేన్, కృష్ణ, ఓం ప్రకాష్, కుర్సెంగ మూతిరామ్, మడావి శ్రీనివాస్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

చదరంగంతో మానసిక ప్రశాంతత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

చదరంగం ఆడటం వల్ల మానసిక ప్రశాంతత ఉంటుందని జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెస్ చాంపియన్‌సిప్ పోటీల బహుమతి ప్రధానోత్సవానికి మాజీ ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసిఫాబాద్‌లో నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. మారుముల గ్రామాలలో కూడా క్రీడాకారులను ప్రోత్సహించడానికి జిల్లా చెస్ అసోసియేషన్ కృషి ఎనలేనిదని కొనియాడారు. విద్యార్థులు చెస్ క్రీడను నేర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ప్రపంచ క్రీడారంగంలో చదరంగం ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. చదరంగంలో రాణించడం వల్ల మేధాశక్తి, విజ్ఞాన పరిజ్ఞానం, వ్యూహాత్మకత, కళా నైపుణ్యం పెంపొందించుకోవచ్చన్నారు. ఈ క్రీడలో రాణిస్తున్న వారికి విద్యా, ఉద్యోగ అవకాశాలలో ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా విజేతలకి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ ఈగ కనకయ్య, కుమురం భీం జిల్లా అధ్యక్షులు ఎస్.సంపత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బోగే ఉపేందర్, ఏసీఎంఓ ఉద్దవ్, చెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్పన, టోర్నమెంట్ కన్వీనర్ రవీందర్, జాయింట్ సెక్రెటరీ, తిరుపతి, శృతిక, సమ్మయ్య పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి సర్వే ఆన్‌లైన్ డాటా ఎంట్రీ కేంద్రాన్ని ఆదివారం ఆసిఫాబాద్ డీఆర్ఓ ఎల్.లోకేశ్వర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ డాటా ఎంట్రీలో ఖచ్చితత్వాన్నీ పాటించాలని, నిర్దిష్ట సమయంలో సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు పూర్తిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కంప్యూటర్ ఆపరేటర్‌లను తీసుకొని త్వరగా కుటుంబ వివరాలు ఆన్‌లైన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డాటా ఆన్‌లైన్



నమోదు పర్యవేక్షకులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ ఎండీ రియాజ్ అలీ, ఎంపీఓ జావీద్, కార్యాలయం సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



నవతెలంగాణ-వాంకిడి

మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులపై నేటి నుండి సామాజిక తనిఖీ బృందాల ద్వారా తనిఖీ సర్వే చేయించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పనుల తనిఖీ అనంతరం అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి తనిఖీ వివరాలను గ్రామసభలలో వివరించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక డిసెంబర్3న డీఆర్‌డీఓ సమక్షంలో ఏర్పాటు చేసి అన్ని గ్రామ పంచాయతీల తనిఖీ వివరాలను వెల్లడిస్తామన్నారు. సామాజిక తనిఖీ బృందాలు ఎస్ఆర్‌పీ బెజ్జంకి తిరుపతి పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహిస్తారన్నారు.

పోటీతత్వాన్ని విద్యార్థులు పెంచుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం ఉన్న పోటీ యుగంలో విద్యార్థులు పోటీ తత్వాన్ని పెంచుకోవాలని దీనికి క్రీడలే సాధనంగా నిలుస్తాయని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిని రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రాల్లోని గిరిజన క్రీడ పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలలో విజయం సాధించిన వారికి బహుమతుల ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచుతాయన్నారు. మానసిక శారీరక ఉల్లాసానికి తోడ్పడతాయన్నారు. అంతకుముందు పోటీలను జండా ఊపి ప్రారంభించిన మాజీ ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాలో విద్యార్థులను క్రీడల్లో ముందించేలా శిక్షకులు కృషి చేయాలన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాల నుండి 100 మందికి పైగా విద్యార్థులు అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారని తెలిపారు. వీరి నుండి 25 మందిని ఎంపిక చేసామని వీరు డిసెంబర్ ఒకటిన మంచిర్యాలలో జరిగే పదవ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొట్నాక విజయ్, ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్, ఏసీఎంఓ ఉద్దవ్, గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రెజరర్ గుండం లక్ష్మణ్, ఉపాధ్యకుడు కుర్సెంగ శ్రీనివాస్, అథ్లెటిక్స్ కోచ్ విద్యాసాగర్, పీడీ హరికృష్ణ, పీఈటీ స్వప్న, సౌందర్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

అత్యపత్య రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి అత్యపత్య క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. క్రీడా పోటీలకు ముఖ్యఅతిథిగా జిల్లా క్రీడల అధికారిని రమాదేవి, రాష్ట్ర అత్యపత్య ప్రధాన కార్యదర్శి ముఖేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు జిల్లాలో నిర్వహించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు అన్ని ఆటలపై శ్రద్ధ కనబరచాలని సూచించారు. నిర్వాహకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాలలో 16 జిల్లాల నుండి 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని వారి నుండి 15 మంది బాలురను, 15 మంది బాలికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి ప్రత్యేక క్యాంపు నిర్వహించనున్నట్లు వివరించారు. క్యాంపులో ప్రతిభ కనబరిచిన 12 మందిని చివరి దశలో ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అత్యపత్య జిల్లా అధ్యక్షుడు ఖట్కార్ భీంరావ్, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా జనరల్ సెక్రెటరీ కనపర్తి రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లెబిన్, క్రీడా సెక్రెటరీ బొమ్మ కంటి కిరణ్, ఖేలో ఇండియా కోచ్ కడ్తల రాకేష్, హ్యాండ్ బాల్ కోచ్ అరవింద్, ఖోఖో కోచ్ తిరుమల్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు 8వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఐదు సంవత్సరాలు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ ఇవ్వడానికి 8వ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలురు, బాలికల పాఠశాలలను సెంటర్లుగా ఎంపిక చేశారు. జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయ బాబు వివరాలు వెల్లడిస్తూ రెండు సెంటర్లలో కలిపి ఉదయం 9:30 నుండి 12:30 వరకు జరిగిన పరీక్షలలో మొత్తం 483 మంది పరీక్ష రాయాల్సి ఉన్నప్పటికీ 431 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా స్థానిక సీఐ బుద్దె రవీందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | నవంబర్ 25, 2024 | www.navatelangana.com

తప్పులు లేకుండా ఆన్లైన్ చేయాలి : ఎంపీడీఓ

నవతెలంగాణ-జన్నారం



సమగ్ర సర్వే ప్రొఫార్మలో ఉన్న వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీఓ శశికళ సూచించారు. ఆదివారం మండలంలోని ఐటీఐ కళాశాల, ఇందన్‌పల్లి గ్రామపంచాయతీ, కలమడుగు, జన్నారం, ఐకేపీ, కార్యాలయాలలో ఆన్‌లైన్ చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ప్రతి అన్యుమినేటర్ విధిగా తను గ్రామంలో చేసిన కుటుంబ సర్వే బుక్ లెట్ ప్రకారం ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయించాలన్నారు. వారికి కావలసిన అన్ని ఏర్పాట్లను చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆపరేటర్లు ఎన్యుమరేటార్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో పదవ తరగతి 1997-98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సురభి గోధ క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 27 సంవత్సరాల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి మొదటగా మరణించిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సంతాపం తెలిపారు. ఒకచోట చేరిన స్నేహితులంతా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ యోగక్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఆట పాటలతో సంతోషంగా గడిపారు. అనంతరం ఆర్థిక స్థోమత లేని వారి స్నేహితులకు ఆర్థిక సాయం చేశారు. ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లిలో బొమ్మె చేపల సంరక్షణ కేంద్రం

- రూ.15 కోట్లతో 30 ఎకరాల్లో చేపల పెంపకం
- దేశానికి తలమానికంగా నిలవబోనున్న హాజీపూర్
- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-హాజీపూర్

రాష్ట్ర చేప కొరమీను పెంపకం, సంరక్షణ ప్రాజెక్ట్ భారీ ఎత్తున చేపడుతుండగా దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా హాజీపూర్ తలమానికంగా నిలవబోనుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్రావు అన్నారు. ఆదివారం మండలంలోని గుడిపేట గ్రామ శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద కొరమీను పెంపకం, సంరక్షణ ప్రాజెక్ట్ ప్రతిపాదిత స్థలాన్ని రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రేమసాగర్రావు పర్యవేక్షించారు. ముందుగా కొరమీను సంరక్షణ ప్రాజెక్టుకు సంబందించి రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలించి స్థలం పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఈ భారీ ప్రాజెక్టును ఫిష్పాండ్ ప్రతిపాదిత స్థలమైన 85 ఎకరాల్లో ప్రస్తుతం 30 ఎకరాల్లో రూ.15 కోట్లతో కొరమీను చేపల పెంపకం, సంరక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. కొరమీను జాతిని కాపాడటంతో పాటు సంఖ్యను గణనీయంగా పెంచుతూ రాష్ట్ర అవసరాలను తీర్చి ఇతర రాష్ట్రాలకు దేశాలతో పాటు అంతర్జాతీయ సాయిలో ఎగుమతి చేయడానికి ఈ కొరమీను పెంపల కేంద్రం కేంద్ర బిందువు కానుందని చెప్పారు. అంతేకాకుండా ఇక్కడ ఉత్పత్తయ్యే చేపపిల్లలను రాష్ట్ర వ్యాప్తంగా చేపల పంపిణీ పథకానికి ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. అలాగే చేపల పెంపకం కోసం ఫిష్పాండ్లు ఏర్పాటు చేసుకుని ఉపాధితో పాటు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. 30 ఎకరాల్లో కొరమీను పెంపకం, సంరక్షణ ప్రాజెక్ట్ చేపడుతుండగా మిగిలిన 55 ఎకరాల్లో అక్వా కల్చర్ ఫాం కూడా ఏర్పాటు చేసి అన్ని రకాల చేపల పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిషరీస్ ఏడీ సాంబశివరావు, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, దేశ్పండే, ఎస్ఐ గోపతి సురేష్ పాల్గొన్నారు.

నూతన ఆలయాల్లో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

నవతెలంగాణ-జన్నారం


మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపాన ఉన్న పవిత్ర గోదావరి నది ఒడ్డున శ్రీ సీతారామచంద్ర స్వామి మాలయం పక్కన నూతనంగా నిర్మించిన శివ, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో ఆదివారం విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు, వేద పండితులు ఆలయాల్లో లక్ష్మి సత్యనారాయణ స్వామి హెూమం, రుద్ర హెూమం కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయాలలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఈనెల 23 నుంచి 25 వరకు కొనసాగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మూడు రోజులు ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు వేద పండితులు తిమ్మాపూర్ ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చక చక కుటుంబ సర్వే డాటా ఎంట్రీ

నవతెలంగాణ-తాండూర్

మండలంలో సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ పనులు చకచకా సాగుతున్నాయి. ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రారంభించిన ఈ కార్యక్రమం ఆదివారం సైతం కొనసాగింది. మండలంలోని పంచాయితీ సెక్రటరీలు ఎస్ఆర్ఈజీఎస్, విద్యాశాఖ, ఐకేపీ, కేజీబీవీ చెందిన 30 మంది కంప్యూటర్ ఆపరేటర్లు నిర్వహణలో పాల్గొన్నారు. మండలాన్ని 90 బ్లాక్‌లుగా విభజించారు. బ్లాక్‌లకు సంబంధించిన ఎన్యుమరేటర్ల డాటా ఎంట్రీ ఆపరేటర్లు సమన్వయంతో కుటుంబ సర్వే కంప్యూటరీకరణ పనులను నిర్వహిస్తున్నారు.

హలో మాల చలో హైదరాబాద్ పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని మాల సంక్షేమ సంఘం కార్యాలయంలో హలో మాల చలో హైదరాబాద్ మాలల సింహాగర్జన పోస్టర్లను ఆదివారం జేఏసీ కన్వీనర్ తగరు సుధాకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మాలల సంఖ్య రెండో స్థానంలో ఉందని, వారి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే మాలల సింహగర్జనకి ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాలల శక్తిని చాటాలని అలాగే కొంతమంది ఈ సభను విజయవంతం కాకుండా అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని, దీనికి మన మాల సోదరులందరూ కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపాలిటీలోని మాల జిల్లా జేఏసీ నాయకులు ఉద్యోగ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా తిరుపతి

నవతెలంగాణ-తాండూర్

తెలంగాణ ప్రయివేట్ ఉద్యోగుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా తాండూర్ మండలానికి చెందిన పులగం తిరుపతి ఎన్నికయ్యారు. ఆయన రాష్ట్ర అధ్యక్షులు మియాపురం నాగేశ్వరరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపీయూఎస్ సిద్ధాంతం, ఆదర్శాలకు అంకితమై, నీతి, నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణ, చిత్తశుద్ధితో వ్యవహరిస్తారని తెలిపారు. సహచర నాయకులు, కమిటీలతో కలిసి అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానని పేర్కొన్నారు. ప్రయివేటు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- సీపీ(ఐ)ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-నస్పూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని చార్వక హాల్‌లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోమాస ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలు పక్కదారి పట్టిస్తు, మత విద్వేషాలు రెచ్చగొడుతూ, రాష్టానికి ఇవ్వాలిసిన నిధులు ఇవ్వకుండా భారలు పెంచుతుందన్నారు. కార్పొరేట్లు, పెట్టుబడుదారులు స్వలాభం కోసం ప్రభుత్వ రంగ సంస్థలను అప్పనంగా కట్టబెడుతోందని విమర్శించారు. అదే విదంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలు అమలు ఊసే లేదని కేవలం ఆర్టీసీ బస్సు మాత్రమే అమలులో ఉందని, అందులో కూడా కొత్త బస్సులు పెంచకుండా, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయలేదన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలు, రైతు రుణమాఫీ, నిరుద్యోగ బృతి, ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు ఇంకా అనేక సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి, ఎర్మ పున్నం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, బోడేంకి చందు, గోమాస అశోక్, దుంపల రంజిత్ కుమార్, దూలం శ్రీనివాస్, దాగం రాజారాం, కె ప్రేమ్ కుమార్, ఉమారాణి, కొండగర్ల లింగన్న పాల్గొన్నారు.

సర్వే ప్రక్రియలో వివరాల నమోదు కీలకం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలో ఎన్యూమరేటర్ల ద్వారా సేకరించిన సమాచారాన్ని పోర్టల్‌లో స్పష్టంగా నమోదు చేయడం కీలక ప్రక్రియ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సర్వే వివరాల నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సర్వే ప్రక్రియలో ఎన్యుమరేటర్ల ద్వారా సేకరించిన సమాచారాన్ని డాటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా సంబంధిత పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సర్వే ప్రక్రియలో నిర్దిష్ట నమూనాలో సేకరించిన ప్రతి అంశానికి సంబంధించి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి అంశాలలో సంబంధిత ఇంటి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అందుబాటులో ఉండమని కోరి, సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు చెల్లించే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో 1 లక్షా 53 వేల 29 ఇండ్లు ఉండగా ఇప్పటి వరకు 101.73 శాతంతో 1 లక్షా 55 వేల 681 ఇండ్లు సర్వే చేయడం జరిగిందని, ఇండ్ల నమోదు ప్రక్రియలో గుర్తించబడని ఇండ్లను సైతం సర్వే చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో 1 లక్ష 1 వేయి 140 ఇండ్లు ఉండగా ఇప్పటివరకు 97 వేల 742 ఇండ్లను సర్వే చేయడం జరిగిందని, జిల్లాలో మొత్తంగా 2 లక్షల 54 వేల 169 ఇండ్లకు గాను 99.71 శాతంతో 2 లక్షల 53 వేల 423 ఇండ్లు సర్వే పూర్తి చేశామన్నారు. సర్వేలు సేకరించిన సమాచారాన్ని ఆన్ లైన్ పోర్టల్‌లో నమోదు చేసేందుకు అవసరమైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి శిక్షణ అందించడం జరిగిందని, జిల్లాలో డాటా ఎంట్రీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, ప్రతిరోజు అధికారుల సమన్వయంతో పాఠశాలలను సందర్శించి ఆహారం నాణ్యత, పరిసరాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్



నవతెలంగాణ-నస్పూర్

శాంతి భద్రతల పరిరక్షణకు, పోలీసుల భద్రతపై ప్రజలకు భరోసా కల్పించడానికి కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్ ఏరియాలోని కొత్త రోడ్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భముగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత అని, గ్రామంలో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ కూడదని, యువత చెడు అలవాట్లకు గంజాయి, మద్యం, డ్రగ్స్‌లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకరావాలని లేదా సమస్యలుంటే 100 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసెజ్, వాట్సాప్ కాల్స్‌లకు స్పందించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ప్రతిజ్ఞ చేయించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలన్నారు. కాలనీలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, ఆత్మ హత్యలు, లైంగిక వేదింపులు, గంజాయి వంటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న దురాచారాలపై, వివిధ చట్టాలపై ప్రజలను చైతన్యం చేస్తూ, షీ టీమ్, డయల్ 100 గురించి అవగాహన కల్పించారు. సరైన వాహన పత్రాలు, నెంబర్ ప్లేట్ సరిగా లేని 40 ద్విచక్ర వాహనాలు, 05 ఆటోలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, ఎస్ఐలు సంతోష్, శ్రీధర్, లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

సన్న వరి ధాన్యానికి రూ.500 బోనస్



నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వం సన్న రకాల వడ్లకు రూ.2300 మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ చెల్లిస్తుందని ప్రత్యేక అధికారి అంజయ్య తెలిపారు. ఆదివారం ఎంపీడీఓ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ ప్రసాద్‌తో కలిసి తాండూర్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దళారులు వరి ధాన్యాన్ని ప్రయివేటు వ్యక్తులకు అమ్మి మోసపోవద్దని తెలిపారు. రైతులు వరి కోతల సమయంలో సరైన నాణ్యత ప్రమాణాలు పాటించి నాణ్యమైన ధాన్యాన్ని అమ్మకానికి తీసుకురావాలని తెలిపారు. హార్వెస్టర్ యజమానులు వరి కోతల సమయంలో నిబంధనలు పాటించాలని తెలిపారు. వరి పూర్తిస్థాయిలో కోతకు వచ్చిన తర్వాత హార్వెస్టింగ్ చేయాలన్నారు. ధాన్యంలో పోల్లు, తాలు రాకుండా ఫ్యాన్లను వినియోగించాలని తెలిపారు. పచ్చి వరిపైరును హార్వెస్టింగ్ చేయరాదని తెలిపారు. రైతులు వరి ధాన్యాన్ని 18 శాతం వచ్చేవరకు కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టాలని తెలిపారు. పీఏసీఎస్ అధికారులు కొనుగోలు కేంద్రం వద్ద మద్దతు ధరను తెలియజే సే బోర్డు తేమ యంత్రాలు టార్పలిన్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అందించే మద్దతు ధర బోనస్‌పై అవగాహన కల్పించాలన్నారు.

రేపటి దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విదానాలను ఎండగడుతూ ఈ నెల 26 చేపట్టే దేశవ్యాప్త నిరసనలు జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ అంబటి లక్ష్మణ్ అన్నారు. ఆదివారం మధ్యాహ్నం మండలంలోని శ్రీలంక కాలనీలో దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం దేశ స్వాతంత్రాన్ని, స్వావలంబనలను తాకట్టుపెడుతున్నదన్నారు. నిత్యం స్వదేశీ జపం చేస్తూ, విదేశీ సంస్థలకు సాగిల పడుతుందన్నారు. మన జాతీయ సంపదను, వనరులను లూటీ చేస్తుందని, అనేక త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడలుగా మార్చి సమ్మె హక్కులను కాలరాస్తుందన్నారు. బీజేపీ ప్రభుత్వ వినాశకర విధానాలను కార్మిక వర్గం, రైతులు, వ్యవసాయ కార్మికులు నవంబర్ 25న మండల కేంద్రాల్లో, 26న జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలపాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని హస్టల్‌తండా గిరిజన గ్రామంలో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా వారిని ఆదివారం ఆ గ్రామస్తులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. హస్టల్‌తండాలోని లకావత్ శ్రీనివాస్ సింగరేణి, తేజావత్ సోనీ పోలీస్ కానిస్టేబుల్, కావత్ రాజు రెవెన్యూ డిపార్ట్మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్, ముగ్గురికి ఎంసెట్ ర్యాంకు ద్వారా లకావత్ విజేష్ వెటర్నరీ సీటు, బోడ శ్రీకాంత్ అగ్రికల్చర్‌లో సీటు, బోడ మహేష్ ఫిషరీష్‌లో సీట్లు సాధించి గ్రామానికి ఆదర్శంగా నిలిచారు. ఉద్యోగాలు సాధించిన వీరందరినీ గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో హస్టల్ తండా మాజీ తాజా సర్పంచ్ జయశ్రీ సంతోష్, ఉప సర్పంచ్ రాథోడ్ బాలాజీ, బాదావత్ శ్రీనివాస్, బీఆర్ఎస్ విలేజ్ కమిటీ అధ్యక్షుడు బానోతు అంబాజీ, లకావత్ ధర్మేష్, భూక్య అమర్ సింగ్, భూక్య గబ్బర్ సింగ్, శ్రావణ్, అరవింద్ సన్మానించారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

- ప్రమాదపుటంచున కడెం డిస్ట్రిబ్యూటరీ కెనాల్



నవతెలంగాణ-లక్సెట్టిపేట

పట్టణంలోని మిషన్ కాంపౌండ్ ఏరియాలో చర్చి గేట్ ఎదురుగా రహదారి ప్రక్కన కడెం డిస్ట్రిబ్యూటరీ 37 కెనాల్ పిల్ల కాలువ ప్రమాద కరంగా మారింది. బైపాస్ ప్రధాన రహదారి అయిన మిషన్ కాంపౌండ్ పరిధిలోని రోడ్డు ప్రక్కన కడెం కెనాల్ పిల్ల కాలువకు సైడ్ వాల్ లేదు. నిత్యం వివిధ పనులతో అనేక మంది ప్రయానికులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు ఆ రహదారి గుండా ప్రయాణం చేస్తారు. వాహనాలపై వెళ్లే వారు అదుపు తప్పితే కాలువలో పడే ప్రమాదం ఉంది. రాత్రి పూట ప్రయాణించే వారికి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారుల పట్టించుకోకపోవడంతో పిల్ల కాల్వ కాస్త వ్యర్థంగా మారిపోయి రైతులకు నీరు కూడా అందలేని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సైడ్ వాల్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యాశాఖకు మంత్రిని వెంటనే కేటాయించాలి

- యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి

నవతెలంగాణ-లక్సెట్టిపేట

తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థను ప్రభుత్వం గాలికొదిలేసిందని యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. ఆదివారం లక్సెట్టిపేట పట్టణ కేంద్రంలో నాయకులతో కలిసి భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ మొట్ట మొదటి అఖిల భారత మహాసభల బ్రోచర్లు విడుదల చేశారు. ఈ సంధర్భంగా తిరుపతి మాట్లాడుతూ 2024 డిసెంబర్ 14,15 తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో నిర్వహించనున్నట్టు తెలిపారు. యూఎస్ఎఫ్ఐ సంఘం 1984 సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీ పోరాటాల గడ్డపై ఏర్పడిందన్నారు. ఐక్యత, పోరాటం అనే నినాదంతో ముందుకు సాగుతోందని, దేశంలో అందరికి సమాన విద్య అవకాశాలు కల్పించాలని విద్యారంగ అభివృద్ధికై నాటి నుంచి నేటి వరకు కృషి చేస్తూ వస్తుందని అన్నారు. రాష్ట్రంలో పరిస్తితి చూస్తే విద్యా శాఖ గురించి ఆలోచించకుండా విద్య వ్యవస్థను గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క పక్క గురుకులలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు కొట్టుమిట్టాడుతుంటే, మరో పక్క ఫీజు బకాయిలు విడుదల కాక డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు పరీక్షలనే నిర్వహించకుండా కాలేజీలు నిరవధికంగా మూసి వేసుకునే పరిస్తితులు నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, రాజేష్, ప్రసాద్, అఖిల్, మహాజన్ పాల్గొన్నారు.

